RNI NO:Title-Code:-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



భారతీయులను ఏకం చేసిన వినాయక చవితి

4లో.

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 1 సంచిక - 237 శనివారం 07 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# మూడు కమిషన్లకు చైర్మన్లు

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృత్వంలో విద్యా కమిషన్
- వ్యవసాయ కమిషన్‌కు కోదండరెడ్డి, బిసి కమిషన్ చైర్మన్‌గా జి. నిరంజన్

నలుగురు సభ్యుల నియామకం.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ







**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** విద్యా, బిసి, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌లను ప్ర భుత్వం నియమించింది. విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళి, బిసి కమిషన్ చైర్మన్‌గా జి.నిరంజన్, రైతు కమిషన్ చైర్మన్‌గా కోదండరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూ రి మురళి విద్యా కమిషన్ చైర్మన్‌గా రెండేళ్ల పాటు పదవి లో కొనసాగనున్నారు. అలాగే, బిసి కమిషన్ సభ్యులుగా రాపోలు జయప్రకాశ్, టి.సురేందర్, బాలలక్ష్మి, మెంబ ర్ సెక్రటరీగా బిసి సంక్షేమ శాఖ కమిషనర్ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా కోదండరెడ్డి రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు.



తక్షణ సాయంతో పాటు శాశ్వత పునరుద్ధరణ పనులకు నిధులివ్వాలని విజ్ఞప్తి

ఏపీకి ఎలాంటి సాయం చేస్తారో తెలంగాణకూ అలాగే చేయాలన్న సీఎం

ఎన్డీఆర్ఎఫ్ నిధుల విషయంలో మార్గదర్శకాలను సడలించాలని కేంద్రమంత్రిని కోరిన సీఎం

# నిధులు కేటాయించండి

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పర్యటించారు. అనంతరం హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలువురు మంత్రులతో సమావేశమయ్యారు. వరద ప్రభావం, నష్టాన్ని సచివాలయంలో కేంద్రమంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రి, అధికారులు వివరించారు.

2లో.



# బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూత



బ్రెయిన్ ఇన్ ఫెక్షన్ తో మృతి

తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తింపు

బిఆర్ఎస్ యువజన విభాగానికి అధ్యక్షుడిగా సేవలు

యువ తెలంగాణ పార్టీ స్థాపన

కాంగ్రెస్, వైసిపిలోనూ కీలక బాధ్యతలు

జిట్టా బాలకృష్ణ మరణం పట్ల పలువురు నేతలు సంతాపం

2లో.

# తెలుగు రాష్ట్రాలను కేంద్రం ఆదుకుంటుంది

కేంద్రమంత్రి బండి సంజయ్

రాజకీయాలు పక్కన పెట్టి తప్పనిసరి పరిస్థితుల్లో సచివాలయానికి వెళ్లాను: బండి సంజయ్

వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్న బండి సంజయ్

వరదల కారణంగా తెలుగు రాష్ట్రాల్లో భారీ నష్టం జరిగిందని వెల్లడి

2లో.



# తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్

ప్రకటించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్

జులై 7తో ముగిసిన రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవీ కాలం

పీసీసీ కోసం పోటీ పడిన సీనియర్ నేతలు మధుయాష్కీ, బలరాం నాయక్

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవీకాలం గత జులై 7వ తేదీతో ముగిసింది. దీంతో ఆయన స్థానంలో అధ్యక్ష పదవికి పలువురు సీనియర్ నేతలు పోటీ పడ్డారు. ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పోటీ పడ్డారు. అధిష్ఠానం మహేశ్ కుమార్ గౌడ్ వైపు మొగ్గు చూపింది.



# డీఎస్సీ ఫైనల్ కీ విడుదల..




**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ డీఎస్సీ పరీక్షల ఫైనల్ కీ విడుదల అయ్యింది. పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో కీలు, రెస్పాన్స్ షీట్స్ లను అందుబాటులో ఉంచినట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.కాగా, ప్రాథమిక కీ ఆగస్టు 13వ తేదీన విడుదలైన సంగతి తెలిసిందే. ఆగస్టు 20వ తేదీలోగా అభ్యంతరాలు స్వీకరించారు. ఫైనల్ కీని ఇవాళ విడుదల చేశారు. డీఎస్సీ పరీక్షలను ఈ ఏడాది జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఫైనల్ కీ, రెస్పాన్స్ షీట్ల కోసం https://tgdsc.aptonline.in/tgdsc వెబ్‌సైట్ లింక్‌ను క్లిక్ చేయండి.

# కేంద్ర మంత్రుల ఏరియల్ సర్వే

- వరద ప్రభావిత జిల్లాల్లో శివరాజ్, బండి సంజయ్, రాష్ట్ర మంత్రుల పర్యటన

**ఖమ్మం సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను చూసి చలించిపోయానని, రైతులకు సాయం చేయడం అంటే దేవుళ్ళకు పూజ చేసినట్లేనని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఖమ్మం జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను శు క్రవారం కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆయన ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిం చారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతోపాటు సమీపంలోని సూర్యాపేట, మహబూబాబాద్, ములుగు జిల్లాలో వరద వల్ల దెబ్బతిన్న పాంత్రాలను కూడా ఆయన ఏరియల్ సర్వే చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టి ఖమ్మం జిల్లా, మధిర నియోజకవర్గం, ఎర్రుపాలేం మండల కట్టలేరు వరద నీటితో ముంపునకు



గురైన పంట పొలాలను ఆ తరువాత ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగు ఉప్పొంగడంతో ముంపు ప్రాంతానికి గురైన ప్రకాష్ నగర్ కాలనీని ఏరియల్ సర్వే ద్వారా కేంద్ర మంత్రులకు చూపించారు. మున్నేరు వరదల వల్ల పేద మధ్యతరగతి ప్రజలు నష్టపోయిన వివరాలను ఆయన కేంద్ర మంత్రికి వివరించారు.

మిగతా 3లో.

# ఫామ్ హౌస్ లో కేసీఆర్ దంపతుల నవగ్రహ యాగం..



2లో.

# ఫామ్ హౌస్ లో కేసీఆర్ దంపతుల నవగ్రహ యాగం..

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, గులాబీ పార్టీ అధినేత కెసిఆర్ సిద్దిపేట ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో ప్రత్యేక పూజలు వేద పండితుల సమక్షంలో నవగ్రహ యాగం చేయించారు కెసిఆర్ దంపతులు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు.ఇది ఇలా ఉంటే కేసీఆర్ త్వరలో పర్యటనలు సిద్దమవుతున్నట్లు సమాచారం.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. రైతుల విషయంలో అలాగే ఇతర విషయాలలో లో దారుణంగా విఫలమైందని కేసీఆర్ ఇప్పటికే గుర్తించారట. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజల సమక్షంలో నిలదీసేందుకు కేసీఆర్ బయటకు వస్తున్నారు. వినాయక చవితి తర్వాత బస్సు యాత్రలు చేయనున్నారట. వినాయక చవితి రోజున ఈ యాత్రకు సంబంధించిన షెడ్యూల్ కూడా రిలీజ్ చేయబోతుంది గులాబీ పార్టీ.

# ఆర్టికల్ 370 ముగిసిన ఘట్టం...

## దానిని పునరుద్ధరించే ప్రసక్తి లేదు: అమిత్ షా

శ్రీనగరం **సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**




జమ్మూకశ్మీర్ కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 మీద హెూం శాఖ మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. దానిని పునరుద్ధరించడం ఎన్నటికీ జరగదన్నారు. జమ్మూకశ్మీర్ బిజెపి ఎన్నికల మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు.2019లో ఆర్టికల్ 370 రద్దయ్యాక శాంతి స్థాపనకు మార్గం సుగమం అయ్యిందన్నారు. కశ్మీర్ లో ఉగ్రవాదానికి, వెనుకబాటు తనానికి కారణమే 370 ఆర్టికల్ అని, దానిని ఎట్టి పరిస్థితిలో పునరుద్ధరించే ప్రసక్తే లేదన్నారు. ఆర్టికల్ 370 ఒక చరిత్రనే ఇక అన్నారు. కశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దయ్యాక జరుగుతున్న మొదటి అసెంబ్లీ ఎన్నికలు ఇవేనన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు మూడు విడతలలో జరుగనున్నదన్నారు.

# జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూత

## భావోద్వేగంతో సిఎం రేవంత్ ట్వీట్

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**



తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి శుక్రవారం ఉదయం కన్నుమూశారు. దీంతో ఆయన మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సంతాపం తెలిపారు. జిట్టా మరణంపై రేవంత్ తన ట్విట్టర్‌లో భావోద్వేగానికి గురయ్యారు. మిత్రుడు, సన్నిహితుడు జిట్టా బాలకృష్ణా రెడ్డి అకాల మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. యువతను ఐక్యం చేసి చేసి తెలంగాణ ఉద్యమంలో కీలక ప్రాత పోషించారని గుర్తు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడి ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ రేవంత్ ట్వీట్ చేశారు. ఆయన గత కొన్ని రోజుల నుంచి బ్రెయిన్ క్యాన్సర్ తో బాధపడుతున్నారు. యశోదాస్పత్రిలో చికిత్స తీసుకుంటూ జిట్టా తుదిశ్వాస విడిచారు.

# తెలుగు రాష్ట్రాలను కేంద్రం ఆదుకుంటుంది

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**




భారీ వర్షాలు, వరదల వల్ల తెలుగు రాష్ట్రాలు బాగా నష్టపోయాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. అన్ని అంశాలు కేంద్రం దృష్టిలో ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం నివేదిక అందిందని చెప్పారు. నివేదికలను పరిశీలించి నిబంధనల ప్రకారం తెలంగాణ, ఏపీకి కేంద్రం సహాయం చేస్తుందని చెప్పారు. హోటల్ హరిత ప్లాజాలో మంత్రి సంజయ్.. మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఇది రాజకీయాలతో కూడిన సమస్య కాదని, ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సహాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని అన్నారు. 'ఎస్డీఆర్ఎఫ్ నిధులు రూ.1,345 కోట్లు ఉన్నాయి. గత ప్రభుత్వం ఈ నిధులను వాడుకోలేకపోయింది. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం. తెలంగాణను అన్ని విధాలుగా ఆదుకుంటామని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి.. రాజకీయాలను పక్కనపెట్టి తప్పనిసరి పరిస్థితుల్లో సచివాలయానికి వెళ్లాను. గతంలో వరదలు వచ్చినప్పుడు ఎప్పుడూ గత ప్రభుత్వం కేంద్రమంత్రుల్ని పిలవలేదు.. కలవలేదని బండి సంజయ్ అన్నారు.

# వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య విషయంలో మౌనం ఎందుకు..?:కెటిఆర్

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**



రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది..? అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సహా ప్రభుత్వ పెద్దలు ఎవరు కూడా ఒక్క మాట ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు. వరదల కారణంగా 31 మంది మృతి చెందారని, వారి వివరాలను బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ముందు ఉంచిందని చెప్పారు.
కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 16 మంది మాత్రమే మృతి చెందినట్లు చెబుతోందని, మృతుల సంఖ్య అంతే అని ఏ విధంగా నిర్ధారణకు వచ్చారని అడిగారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇంత మంది చనిపోయారని, బాధితుల పేర్లు, వివరాలు ప్రజలకు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. తప్పుడు లెక్కలు చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను అపహాస్యం చేస్తోందని దుయ్యబట్టారు. అదేవిధంగా మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి గతంలో డిమాండ్ చేసిన విధంగా ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని అన్నారు.

# బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూత

**భువనగిరి సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూశారు. బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయన గత కొంతకాలంగా సికింద్రాబాద్ యశోద హాస్పటల్ లో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శు క్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు భువనగిరికి తరలించారు. సాయంత్రం 4 గంటలకు పట్టణ శివార్లలోని మగ్గంపల్లి రోడ్డులో ఉన్న తమ ఫామ్‌హౌస్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా జిట్టా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు..



జిట్టా బాలకృష్ణ రెడ్డి 14 డిసెంబర్ 1972న తెలంగాణ రాష్ట్రం, యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మాయిపల్లి గ్రామంలో జిట్టా బాలరెడ్డి, రాధమ్మ దంపతులకు జన్మించాడు. ఆయన 1987లో బీబీ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సెకండరీ స్కూల్, 1989లో భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, 1993లో ఎల్‌బీ నగర్ నుంచి డీవీఎం డిగ్రీ అండ్ పీజీ కాలేజీ నుంచి డిగ్రీ పూర్తి చేశారు.
తెలంగాణ ఉద్యమకారుడిగా జిట్టా బాలకృష్ణారెడ్డికి గుర్తింపు ఉంది. బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత జిట్టా పార్టీ అనుబంధ యువజన సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. కానీ, 2009 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ దక్కకపోవడంతో పార్టీ నుంచి బయటకు వచ్చిన ఆయన ఇండిపెండెంటుగా పోటీ చేసి ఓడిపోయారు. 2014, 2018 ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన ఓటమి చవిచూశారు. 2009లో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.
వైఎస్సార్ హఠాన్మరణం తర్వాత కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి వైసీపీలో చేరారు. అయితే లోక్‌సభలో వైఎస్ జగన్ తెలంగాణ వ్యతిరేక విధానాన్ని తీసుకోవడంతో అక్కడి నుంచి కూడా బయటపడి సొంతంగా యువ తెలంగాణ పార్టీని నెలకొల్పి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ తరపున పాల్గొన్నారు.జిట్టా బాలకృష్ణారెడ్డి మరణ వార్త తెలుసుకుని భువనగిరి, ఆలేరు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ఆవేదనకు లోనయ్యారు. తెలంగాణ ఉద్యమం మొదలైన నాటి నుంచి భువనగిరి కోటకు లైట్లు వేయడం, భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టారు. అన్ని గ్రామాల్లో యువతను తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం పోరాటంలో ఉత్సాహపరచడం, గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం, సాగు, తాగునీటి కాలువల కోసం పోరాటం చేశారు.
ఇక పోచంపల్లి ప్రాంతంలో కాలుష్య కంపెనీలపై కొట్లాడడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం లాంటి అనేక మంచి కార్యక్రమాలు చేయడంతో ఆయన లేరన్న వార్తను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన తిరిగి కోలుకుని ఆరోగ్యంగా ప్రజల ముందుకు రావాలని ఇటీవలే ఆయన అభిమానులు భువనగిరి ఎల్లమ్మ గుడి నుంచి యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని నియోజకవర్గంలోని చాలా చోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కానీ, ఇప్పుడు ఆయన మరణవార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

# నిధులు కేటాయించండి

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అతలాకుతలం అయిన తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కేంద్ర ప్రభుత్వం భారీ సాయం ప్రకటించింది. విపత్తు నిర్వహణ నిధి నుంచి రూ.3,448 కోట్లను కేంద్రం కేటాయించింది. తక్షణ సహాయం అందించడానికి ప్రక్రియ జరుగుతోందని, ఈ నిధుల్లో కేంద్రం వాటా కూడా ఉందని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. రెండు రాష్ట్రాల్లో సంభవించిన వరదల సహాయ కార్యక్రమాలకు నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇవాళ శుక్రవారం తెలంగాణలోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. సామాన్య ప్రజలు, రైతులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. అంతకు ముందు ఆయన ఆంధ్రప్రదేశ్‌లో కూడా పర్యటించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సమర్థతతో పని చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటనలో శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో వరద నష్టం తీవ్రంగా ఉందని, తక్షణ సాయంతో పాటు శాశ్వత పునరుద్ధరణ పనులకు తగిన నిధులు కేటాయించాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో వరదల వల్ల సుమారు 5,438 కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచాన వేసినట్లు వివరించారు. ఎస్‌డీఆర్ఎఫ్ నిధుల విడుదల విషయంలో మార్గదర్శకాలను సడలించాలని కోరారు. సచివాలయంలో కేంద్ర మంత్రికి వరద ప్రభావం, నష్టాన్ని ముఖ్యమంత్రి, అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి సాయం చేస్తారో తెలంగాణకూ అదే స్థాయిలో చేయాలని, రెండు రాష్ట్రాలనూ ఒకే విధంగా చూడాలని సీఎం కోరారు. పలు జిల్లాల్లో ఒక్క రోజే 40 సెం.మీ వర్షంకురిసిందని, వరద ప్రభావిత జిల్లాల్లో పరిస్థితి దారుణంగా ఉందని సీఎం చెప్పారు. రహదారులు, ఇళ్లు, బ్రిడ్జిలు పూర్తిగా దెబ్బతిన్నాయని.. రాకపోకలు స్తంభించాయని సీఎం తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర పంట నష్టం జరిగిందని.. పొలాలన్నీ రాళ్లు, ఇసుక మేటలతో నిండిపోయాయని వివరించారు. తక్షణ సాయంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలకు రూ.10వేలు పంపిణీ చేస్తున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి,



సీఎస్ శాంతికుమారి వివిధ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఇవాళ తెలంగాణలో వరద నష్టంపై సచివాలయంలో కేంద్రమంత్రి శివరాజ్ చౌహాన్‌తో సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల సమావేశం ముగిసింది. రాష్ట్రంలో జరిగిన వరద ప్రభావిత ప్రాంతాల దృశ్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా వివరించారు. పలు జిల్లాల్లో ఒకే రోజు అత్యధికంగా 40 సెం.మీ వర్షం కురిసిందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వరద ప్రభావిత జిల్లాలోని గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉందని వివరించారు. ఇక రోడ్లు, ఇళ్లు, బ్రిడ్జిలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రాకపోకలు స్తంభించాయని ఆయన తెలిపారు. తక్షణ సాయంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలకు రూ.10వేలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర పంట నష్టం జరిగిందని, పొలాలన్నీ రాళ్లు, ఇసుక మేటలతో నిండిపోయాయని అధికారులు పరిస్థితిని వివరించారు.

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

**మంత్రి సీతక్క**

**సామరస్య పూర్వక వాతావరణాన్ని కొనసాగించే చర్యలు చేపట్టండి**

**అసాంఘీక శక్తులకు మంత్రి సీతక్క వార్నింగ్**

**వినాయక చవితి ఏర్పాట్లపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉన్నతాధికారులతో మంత్రి సీతక్క టెలి కాన్ఫరెన్స్**

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులు సమన్వయంతో, అప్రమత్తంగా వ్యవహరించి శాంతియుత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు విజయవంతమయ్యేలా చూడాలని ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సూచించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులు, డీపీఓలు, మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్క టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో వినాయక చవితి ఏర్పాట్లను సమీక్షించారు.ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన



భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవ కమిటీలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎక్కడా ఇలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
జిల్లాలో శాంతికి విఘాతం కలిగించే చర్యలను తమ ప్రభుత్వం సహించదని, ఎంతటి వారినైనా కఠినంగా శిక్షిస్తామని మంత్రి సీతక్క హెచ్చరించారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీపడబోమని స్పష్టం చేశారు. అన్ని మతాల విశ్వాసాలను గౌరవిస్తమన్న మంత్రి, అందరి హక్కులను ప్రభుత్వం కాపాడుతుందని చెప్పారు. ప్రశాంత వాతావరణం లేకపోతే జిల్లా అభివృద్ధి కుంటుపడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. అందుకే ఇక్కడ ఏదైనా సమస్యలు తలెత్తితే దాని మూలాల్లోకి వెళ్లి తుంచేస్తామని స్పష్టం చేశారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే చట్టపరంగా కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్లకు వంద శాతం జీతాలను తమ ప్రభుత్వం పెంచినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇంకా జిల్లా అభివృద్ధి కోసం మరెన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.
వినాయక చవితి నేపథ్యంలో జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు పలు కీలక సూచనలు చేశారు మంత్రి సీతక్క. విగ్రహాల ప్రతిష్ట నుంచి నిమజ్జనం వరకు ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డయల్ 100కి వచ్చే కాల్స్‌పై తక్షణమే స్పందించాలనీ.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుడు ప్రచారం చేసే సోషల్ మీడియా మీద నిఘా పెంచాలని చెప్పారు. జైనూరు తరహాలోనే జిల్లా వ్యాప్తంగా అన్నివర్గాల మత పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి పరస్పరం విశ్వాసం నెల కొల్పేలా చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.టెలి కాన్ఫరెన్స్ సందర్భంగా తమ పరిధిలో చేపట్టిన ఏర్పాట్లను, నెలకొని వున్న శాంతిభద్రతల పరిస్థితులను ఆయా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు మంత్రికి వివరించారు. మంత్రి సూచనలకు అనుగుణంగా అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేసి వినాయక చవితి వేడుకలను శాంతియుత వాతావరణంలో విజయవంతం చేస్తామని తెలిపారు.

# కేంద్ర మంత్రుల ఏరియల్ సర్వే

ఆ తరువాత ఖమ్మం, సూర్యాపేట జాతీయ రహదారిపై టోల్ ప్లాజా పక్కన ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వాగతం పలికారు. సింగినేనిపల్లి హెలి ప్యాడ్ నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జూజులరావుపేట గ్రామానికి వారు రోడ్డు మార్గంలో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం, -సూర్యాపేట జాతీయ రహదారిని నాయకన్ గూడెం వద్ద ఇటీవల భారీ వర్షాల వల్ల పాలేరు మెయిన్ కెనాల్ కు గండిపడిన ప్రాంతాన్ని, దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందం పరిశీలించింది. ఆ తరువాత కూసుమంచి మండలం, పాలేరులోని నవోదయ పాఠశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు, సూర్యాపేట జిల్లాలో భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంట పొలాల ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర మంత్రుల బృందం పరిశీలించింది. అనంతరం ప్రకృతి విపత్తు వల్ల జరిగిన నష్టంపై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ నేరుగా రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదల కారణంగా పంటలు బాగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాన్ని తెలుసుకునేందుకు ప్రధాన మంత్రి తనను ఇక్కడికి పంపించారని, తాను రాజకీయాలు చేయడానికి మాత్రం రాలేదన్నారు. తాను కూడా ఒక రైతునేనని, రైతు బాధలు ఏంటో తనకు తెలుసన్నారు. పంట నష్టంతో రైతులంతా దు:ఖించడం తాను చూశానని, నిరాశకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు. కేంద్రం ఇచ్చిన విపత్తు నిధులను తెలంగాణలో గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆరోపించారు.. ఫసల్ బీమా యోజన సహా కేంద్ర ప్రభుత్వ పథకాలను సైతం రాష్ట్రంలో అమలు చేయలేదన్నారు. గతంలో కేంద్రం ఇచ్చిన నిధులనుఉపయోగించుకుంటే మళ్లీ నిధులు వచ్చే అవకాశం ఉండేదని, కానీ గత ప్రభుత్వం వినియోగించుకోకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కానీ గత ప్రభుత్వం ఆ బీమా పథకాన్ని ఉపయోగించుకోలేక పోయిందన్నారు. రైతుల కోసం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తామంటే కేంద్రాన్ని చేయనివ్వలేదు.. వారు కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. జరిగిన పంటల నష్టంపై హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి అధికారులతో సమీక్ష చేసి ఒక అంచనాకు వస్తామని తెలిపారు. పంట నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక ఇచ్చిన తరువాత రైతులందరికీ న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

# వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

**అనంతగిరి సెప్టెంబర్ 6: (జర్నలిస్ట్ వార్త):**



వరద బాధితులకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తహసిల్దార్ హిమబిందు అన్నారు. గొండ్రియల గ్రామంలో వరద బాధ్యత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యవసర సరుకులు బియ్యం శుక్రవారం వారి చేతుల మీదుగా బాధితులకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు రోజుల నుంచి ముప్పు గ్రామాలను ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ బాధితులకు ప్రభుత్వం నుండి సహాయం అందేలా చూస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు వివిధ శాఖ అధికారులు గ్రామ కార్యదర్శి మండల నాయకులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి గ్రామ నాయకులు గొట్టేముక్కుల బాబురావు నెల్లూరి వినయ్ ఏటుకూరి రమేష్ నెల్లూరి ప్రభాకర్ బండ్ల పుల్లయ్య కలకొండ కోటేశ్వరరావు గంగూరి శీను నాగేష్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# వరద బాధిత జిల్లాలు 29

### ఈ జిల్లాలకు రూ. 3కోట్ల చొప్పున సాయం -వర్షాల కారణంగా 29మంది మృతి: సీఎస్

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**



భారీ వర్షాల కారణంగా 29 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, ఆ జిల్లాలను వరద బాధిత జిల్లాలుగా ప్రకటిస్తున్నట్లు సీఎస్ శాంతి కుమారి పేర్కొన్నారు.ఇటీవల నాలుగు జిల్లాలకు నిధులు విడుదల చేశామని, మిగిలిన 25 జిల్లాలకు రూ.3 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాల కలెక్టర్లతో శాంతి కుమారి శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, వరదలపై సోమవారంలోగా సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆమె ఆదేశించారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 3వ తేదీ మధ్య కురిసిన వర్షపాతం ఆధారంగా వరద బాధిత జిల్లాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. వర్షాల కారణంగా ఇప్పటిదాకా రాష్ట్రవ్యాప్తంగా 29 మంది మృతిచెందారని, ఎక్స్‌గ్రేషియా అందజేసేందుకు వివరాలు పంపాలని కలెక్టర్లకు సూచించారు.

వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టం, మృతుల వివరాలపై 9వ తేదీగా నివేదిక పంపాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. పశువుల మరణాలపైనా నివేదిక కోరింది. ఈ మేరకు విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

భారీ వర్షాలు, వరద వల్ల నష్టపోయిన పంటలకు పరిహారాన్ని అందించేందుకు ప్రభుత్వం విదివిధానాలను ఖరారు చేసింది. 33శాతం మేర నష్టపోయిన పంటలకు పరిహారాన్ని అందజేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వ్యవసాయ డైరెక్టర్ గోపి జారీ చేశారు. అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, 12వ తేదీలోగా వివరాలు అందజేయాలని సూచించారు. ఆ వివరాలను జిల్లా వ్యవసాయ అధికారులు నిర్ధారించాలని తెలిపారు. కలెక్టర్ల ఆమోదంతో అర్హులైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రతిపాదనలను పంపాలని సూచించారు.

# ఎంఎల్ఏ జి. మధుసూదన్ రెడ్డి ధన్య వాదములు




**మహబూబ్ నగర్ : సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**
గత కొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా చిన్నచింతకుంట మండల కేంద్రంలో తాగునీటి ఎద్దడి ఏర్పడిందిఅట్టి విషయాన్ని ఎమ్మెల్యే జి మధు సూధన్ రెడ్డి అన్నకి తెలియజేయగా వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి గతంలో ఉన్న బోరులో నూతన మోటర్లు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడి నివారించాలని అధికారులను ఆదేశించగాస్థానిక నాయకులు అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శి ..సిబ్బంది తో కలిసి నిరంతరంగా శ్రమించి...నేడు గ్రామంలోని 13,14,1,2,5,6,7,8,9,10,11వార్డుల వరకు మోటర్ల ద్వారా త్రాగు నీరు సరఫరా చేయడం జరిగింది.ఈ సందర్భంగా....గ్రామ ప్రజలు గౌరవ ఎంఎల్ఏ జి.మధుసూదన్ రెడ్డి కి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ మండల కో ఆప్షన్ సభ్యులు మహమూద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ శేఖర్ , ఎల్ ఎం రాజు డి.వెంకటన్న ఎస్.జయరాజు ఎస్.మాలగర్ గారు,ఎస్ ఆర్ శాంసన్ ఎస్ కృపాకర్ మెకానిక్ కమ్మరి శ్రీను సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి

### టన్నుకు కనీసం రూ.15 వేలు వచ్చేలా చూడండి

### ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయండి.. శివరాజ్‌కు తుమ్మల విజ్ఞప్తి

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**



: ఆయిల్‌పామ్ రైతులకు మంచి ధర వచ్చేలా చూడాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. 2024-25 సంవత్సరానికి ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ. 15 వేల కనీస మద్దతు ధర కల్పించి రైతులకు భరోసా కల్పించాలని కోరారు. రాష్ట్రంలో వరద నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర మంత్రి శివరాజ్‌ను సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మంత్రి తుమ్మల కలిసి పలు అంశాలపై చర్చించారు. ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చూడడంతోపాటు రాష్ట్రంలో ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డును భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆర్గానిక్ ఫార్మింగ్‌ను అశ్వారావుపేటలో ఏర్పాటు చేయాలని తుమ్మల కోరారు. కనీస మద్దతు ధర లభించక ఆయిల్‌పామ్ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో టన్ను రూ. 20 వేల వరకు ఉండగా ఇటీవల కాలంలో కస్టమ్ డ్యూటీని ఎత్తివేశారని తెలిపారు. దీంతో టన్ను రూ. 12 వేలకే కొనుగోలు చేస్తున్నారని, ఫలితంగా రైతులకు గిట్టుబాటు కావడం లేదని చెప్పారు. కనీస మద్దతు ధర 2024-25లో రూ. 15వేలు ఉండేలా సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి.. త్వరలోనే మూడు అంశాలపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రాష్ట్ర ప్రజలకు కెసిఆర్ వినాయక చవితి శుభాకాంక్షలు

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కష్టాలను తొలగించి ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలను నింపాలని గణ నాథున్ని కెసిఆర్ ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తి శ్రద్ధలతో వినాయకున్ని ప్రార్థించి దేవ దేవుని అనుగ్రహం పొందాలని కెసిఆర్ తెలిపారు.

# రీల్స్ కోసం నోట్లో నాగు.. కాటేయడంతో పాములు పట్టే యువకుడి మృతి

**బాన్సువాడ, సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**



సామాజిక మాధ్యమాల మోజులో మరో యువకుడు బలయ్యాడు. రీల్స్ కోసం పాముతో విన్యాసాలు చేస్తూ వీడియో చిత్రీకరిస్తుండగా అది కాటేయడంతో మృత్యువాతపడ్డాడు.ఈ ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం దేశాయిపేట్‌లో శుక్రవారం వెలుగుచూసింది. దేశాయిపేట్‌కు చెందిన మోచి శివరాజు(20) తన తండ్రి గంగాధర్ ద్వారా పాములు పట్టడం నేర్చుకున్నాడు. గురువారం గ్రామంలో ఓ చోట నాగుపాము ఉందని స్థానికులు ఫోన్ చేయడంతో వెళ్లి పట్టుకున్నాడు. అనంతరం చాలాసేపు దానితో ఆడుతూ విన్యాసాలు చేశాడు.పాము తలను నోట్లో పెట్టుకొని వీడియోలు తీయించుకున్నాడు. ఈ క్రమంలో అది చేతివేలిని కరవడంతో ఇంటికి వచ్చి కుటుంబసభ్యులకు చెప్పాడు. వారు వెంటనే బాన్సువాడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాన్సువాడ సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు.

# ఐస్‌క్రీంలో విస్కీ కలిపి విక్రయిస్తున్న ఐస్‌క్రీం పార్లర్‌పై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడి

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**ఐస్‌క్రీంలో విస్కీ కలిపి విక్రయిస్తున్న ఐస్‌క్రీం పార్లర్‌పై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శుక్రవారం దాడి చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, పార్లర్ నుంచి 11.5కిలోల ఐస్‌క్రీంను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషి ఆబ్కారీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్1లో ఉన్న వన్ అండ్ ఫైవ్ ఐస్ క్రీం పార్లర్‌ను శరత్ చంద్రారెడ్డి ఏర్పాటు చేశారు, అందులో దయాకర్ రెడ్డి, శోభన్ పనిచేస్తున్నారు. నిందితులు భారీగా లాభాలు రావాలని ప్లాన్ వేసి ఐస్‌క్రీంలో 100 పేపర్స్ విస్కీ కలిపి విక్రయించడం ప్రారంభించారు. ఐస్‌క్రీంను తింటున్న యువకులు, యువతులు, పిల్లలు వీస్కీ ఐస్‌క్రీంకు అలవాటు పడి రెగ్యులర్‌గా తినడం ప్రారంభించారు.చాలామంది విస్కీఐస్ క్రీంకు బానిసలుగా మారడంతో నిర్వాహకులు ఎక్కువ ధరకు విక్రయించడం ప్రారంభించారు.



ఎక్కువ ధరకు విక్రయిస్తున్న కూడా తినేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. ఐస్‌క్రీం తినేందుకు యువకులు, పిల్లలు ఎగబడుతున్నారు. నిందితులు 100 గ్రాములు ఐస్‌క్రీంలో 60మిల్లీ లీటర్ల విస్కీని కలుపుతున్నారు. దీంతో పిల్లలు ప్రతి రోజు ఐస్‌క్రీం తినేందుకు ఎగబడుతున్నారు. ఐస్‌క్రీంలో విస్కీ కలిపి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేశారు. వ్యాపారం పెంచుకునేందుకు నిందితులు ఏకంగా ఫేస్‌బుక్‌లో ప్రచారం నిర్వహించినట్లు చేశారు. ఐస్‌క్రీంలో విస్కీ కలిపి విక్రయిస్తు పిల్లల జీవితాలతో ఆడుకుంటున్నారని, ఈ విషయం తెలిసి దాడి చేశామని జాయింట్ డైరెక్టర్ ఖురేషీ తెలిపారు.

# 'విద్యుత్ సిబ్బంది లంచం అడిగారా.. ఫోన్ చేయండి'

### టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):**
విద్యుత్ సిబ్బందిగానీ, అధికారులుగానీ ఏదైనా పనికి డబ్బులు అడిగితే తమకు ఫోన్ ద్వారా తెలియజేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ వినియోగదారులకు సూచించారు.పనుల కోసం లంచం అడిగిన వారిపై 040-23454884 లేదా 7680901912 నంబరుకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదులను నేరుగా తెలుసుకుని పరిష్కరించడానికి ఈ ఏర్పాటు చేసినట్లు వివరించారు. నూతన కనెక్షన్ల మంజూరు, కేటగిరీ, వినియోగదారుల పేరు మార్పు, కరెంటు బిల్లుల్లో లోపాలు తదితర సేవలు పొందేందుకు సంస్థ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా అవకాశం కల్పించినట్లు తెలిపారు. వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించే విద్యుత్ శాఖ ఉద్యోగులపై కఠినచర్యలు తప్పవని సీఎండీ హెచ్చరించారు.

# భారతీయులను

## ఏకం చేసిన వినాయక చవితి



**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** బాగంగాధర్ తిలక్ స్ఫూర్తితో ఏటా ఉత్సవాలు హైదరాబాద్,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): స్వాతంత్రోద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు వినాయక నవరాత్రలను బాగా ఉపయోగించు కున్నారు. ప్రజలను భక్తిభావంతో ఏకం చేసి బ్రిటిషర్లకు వ్యతిరేకంగా నడిపించారు. ఇందులో భాగంగా ఇంటికే పరిమితమైన గణపతి పూజను నవరాత్రులుగా మలిచిన ఘనత లోకమాన్య బాలగంగాధర తిలక్ సొంతం. బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధాన్ని ధిక్కరించేందుకు, దైవభక్తికి దేశభక్తిని జోడించిన అపురూప సందర్భం గణపతి నవరాత్రులు. వలస పాలనలో వివక్షకు లోనవుతున్న భారతీయ సంస్కృతి, సంప్రదా యాలను పునరుద్ధరించేందుకు తొమ్మిది రోజుల వేడుక ఒక ప్రత్యేక సందర్భం. జాతీయోద్యమంలో భాగంగా మహారాష్ట్ర పుణెలో 1893లో లోకమాన్య తిలక్ గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు పిలుపునిచ్చారు. ఆ స్ఫూర్తి భాగ్యనగరానికీ వ్యాప్తి చెందింది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు గణపతి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. దేశభక్తి, స్వాతంత్య కాంక్షను సామాన్యుల్లో రగిలించేందుకు, గమ్యం తెలియని బాటసారి లా అయోమయంలో ఉన్న యువతను ఒక సామాజిక లక్ష్యం దిశగా నడిపించేందుకు, 127 ఏళ్ల క్రితం మహారాష్ట్రలోని పుణె కేంద్రంగా సర్వ జనైక్య గణేశ్ ఉత్సవాలకు లోకమాన్య బాలగంగాధర తిలక్ పిలుపునిచ్చారు. గణపతి నవరాత్రులను సామాజిక వేదికలుగా మలిచారు. ఆ జాతియోద్యమ స్ఫూర్తి దేశవ్యాప్తంగా వ్యాపించింది. స్వరాజ్యం నా జన్మహక్కు అని నినదించిన తిలక్ పిలుపుతో కొందరు భాగ్యనగరవాసులు ముందుకొచ్చారు. నగరంలో స్థిరపడిన కొందరు మహారాష్ట్రీయులు సామూహిక వినాయక పూజకు నాంది పలికారు. దాదాపు 125 ఏళ్ల క్రితం అలా హైదరాబాద్‌లోని గణపతి ఉత్సవాల శోభ ప్రారంభమయ్యింది. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాలు తొలిసారిగా పాతబస్తీలోని శాలిబండ ప్రాంతంలో ప్రారంభమయ్యాయి. కొందరు మరాఠాలు 1895లో గణేశ్ ఉత్సవాలను సామూహికంగా నిర్వహించడం ప్రారంభించారని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. 1895, మార్చి 27న శాలిబండలో ఉగాది పర్వదినం రోజున భారత గుణవర్ధక్ సంస్థను స్థాపించారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న మహారాష్ట్రీయులైన బాలచంద్ర దీక్షిత్, వక్రతుండ దీక్షిత్, నారాయణరావు పిల్‌ఖానె, లక్ష్మణరావు సదావర్తె, దాదాచారి కాలె తదితర మిత్ర బృందం సారథ్యంలో మరికొందరి స్థానిక కాయస్తులు, వ్యాపారవేత్తల సహకారంతో ఆ మరాఠా సంస్థను నెలకొల్పారు. అప్పటి నుంచి కులమతాలకతీతంగా అందరూ కలిసి గణపతి మండపాలను నెలకొల్పడం, తద్వారా రాజకీయ చర్చలు, స్వాతంత్య స్ఫూర్తిని యువతలో ప్రేరేపించే సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే క్రతువుకు శ్రీకారం జరిగింది. ఆ సంస్థ పాలకవర్గ సభ్యులు నేటికీ గణేశ్ నవరాత్రి వేడుకలను కొనసాగిస్తున్నారు. అప్పట్లో చెరువుల్లోని నల్లమట్టినే వినాయక ప్రతిమల తయారీకి వాడేవారు. చవితినాడు మట్టిగణపయ్యను ప్రతిష్ఠించి, తొమ్మిది రోజుల పాటు పూజ కార్యక్రమాలు నిర్వహించేవారు. సాయంత్రం వేళల్లో 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జానపద నృత్యాలు, గీతాలాపన, భక్తి కీర్తనలు, భజన, పారాయణం, పద్య, ఇతిహాస నాటకాలు, సంగీత కచేరీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు, ధనిక, పేద తేడా లేకుండా అందరూ ఆ కార్యక్రమాలు చూసేందుకు పెద్ద ఎత్తున మండపాల వైపు తరలి వచ్చేవారు. ఆ పూజా కార్యక్రమాలు, కళా ప్రదర్శనలే దేశ సమైక్యతకు స్ఫూర్తిగా నిలిచేది. అలాంటి పరిస్థితులలోనూ నిజాం ప్రభుత్వం సమ్మతించేలా గణపతి నవరాత్రులు నగరంలో జరగడం విశేషం. ప్రారంభంలో శాలిబండ నుంచి నగరంలో మరికొన్ని ప్రాంతాలకు గణేశ్ ఉత్సవాలు విస్తృతమయ్యాయి. తొమ్మిది రోజుల పాటూ రోజూ సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు కుటుంబంతో సహా వెళ్లేవాళ్లం. రెండు కళ్లు చాలవు అన్నంతగా సంబరాలు జరిగేవి. పదో రోజు తెల్లవారుజామున పిల్లలు, పెద్దలు అంతా కలిసి మట్టి గణపతిని ఊరేగింపుగా తీసుకెళ్లి మూసీలో నిమజ్జనం చేసేవాళ్లు. అలా మొదలైన ప్రస్థానం ఇప్పుడు ఊరూవాడా విస్తరించింది. ఛత్రపతి శివాజీ పరిపాలనా సమయంలోనే మరాఠా రాజ్యంలో వినాయక ఉత్సవాలు ప్రారంభం అయ్యాయని కొందరు చరిత్రకారులు అంటారు. వినాయకుడిని పీష్వాలు తమ కులదేవుడిగా ఆరాధిస్తారు. కనుక 17వ శతాబ్దంలో శివాజీ చేతుల మీదుగా గణపతి నవరాత్రులు ప్రారంభమయ్యాయని కొందరి అభిప్రాయం. ఆయన స్ఫూర్తి కొనసాగింపుగా లోకమాన్య తిలక్ శివాజీ ఉత్సవాలు, గణేశ్ ఉత్సవాలను ప్రారంభించారని చారిత్రక అధ్యయనకారులు చెబుతారు. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి.

# లోన్‌యాప్ వేధింపులకు విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** లోన్‌యాప్ వేధింపులకు యువకుడు బలైన ఘటన మేడ్చల్ జిల్లాలో చోటు చేసుకుంది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుత్బుల్లాపూర్, సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన ఎంకే విద్యార్థి భాను ప్రకాష్ (22) కనిపించడం లేదంటూ గురువారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. ఆరోరా కళాశాలలో మాస్టర్స్ చదువుతున్న భాను ప్రకాష్ లోన్‌యాప్ ద్వారా లోన్ తీసుకున్నాడు. అయితే తిరిగి లోన్ చెల్లించకపోవడంతో లోన్ యాప్ నిర్వాహకులు వేధింపులకు గురిచేశారు. తీసుకున్న లోన్ కట్టాల్సిందే అంటూ లోన్‌యాప్ పట్టుబట్టారు. దీంతో లోన్‌ఆప్ప్ వేధింపులు తాళలేక భాను, నిన్న సాయంత్రం ఫాక్స్ సాగర్ చెరువులో దూకి బలన్మరణానికి పాల్పడ్డాడు. మొబైల్ లొకేషన్ ద్వారా స్నేహితులు భాను ప్రకాష్ ఆచూకీని కనుగొన్నారు. చెరువు వద్దకు వెళ్లి చూడగా అతని దుస్తులు, వాహనం గట్టుపై ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పెట్ బషీరాబాద్ పోలీసులు యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు... లోన్ యాప్‌కు సంబంధించిన చాటింగ్‌ను పరిశీలిస్తున్నారు. లోన్‌యాప్ నిర్వహకుల వేధింపులకు భాను ప్రకాష్ ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో సంజయ్‌గాంధీ నగర్‌లో విషాదం అలముకుంది.

# వాయు కాలుష్యంతో పురుషుల్లో సంతాన లేమి!

**దీర్ఘకాలంపాటు పీఎం 2.5కి గురైతే పురుషుల్లో వంధ్యత్వం**

**డెన్మార్క్‌లోని నార్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి**

**2000 నుంచి 2017 వరకు 5 లక్షల మందిపై అధ్యయనం**

**ప్రపంచంలోని ప్రతి ఏడు జంటల్లో ఒకదానికి సంతాన లేమి సమస్య**




**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** వాయు కాలుష్యానికి గురైన పురుషులకు సంతానలేమి ముప్పు పొంచి ఉన్నట్టు తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. దీర్ఘకాలం పాటు ఫైన్ పార్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం 2.5) వాయు కాలుష్యాన్ని గురైన పురుషుల్లో వంధ్యత్వం ఏర్పడే ముప్పు అధికంగా ఉందని డెన్మార్క్ అధ్యయనం పేర్కొంది. నార్డ్ యూనివర్సిటీ నిర్వహించిన ఈ అధ్యయన వివరాలు బీఎంజే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ప్రపంచంలోని ప్రతి ఏడుగురు జంటల్లో ఒకటి సంతానలేమి సమస్యతో బాధపడుతోంది. పీఎం 2.5 పురుషులపై ఎక్కువ ప్రభావం చూపిస్తోంది. 2000–2017 మధ్య డెన్మార్క్‌లో 30–45 ఏళ్ల వయసున్న 5,26,056 మందిపై నిర్వహించిన పరిశోధనలో ఈ విషయం బయటపడింది. పీఎం 2.5కి ఐదేళ్లకు పైన గురైన 30–45 ఏళ్ల వయసున్న వారిలో వంధ్యత్య ముప్పు 24 శాతం పెరుగుతున్నట్టు అధ్యయనం వివరించింది.

ప్రపంచ వ్యాప్తంగా జననాల రేటు పెరగాలంటే వాయు కాలుష్యాన్ని ప్రభుత్వాలు నివారించాల్సిన అవసరాన్ని అధ్యయనం నొక్కి చెప్పింది. నాణ్యమైన గాలిని పొందడం మానవ హక్కు అని, కాబట్టి ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయాలని సూచించింది.

# వరదల నుంచి శాశ్వత పరిష్కారం

- వరద నష్టంపై నేడు నివేదిక ఇస్తాం
- ఇన్సూరెన్స్ త్వరగా వచ్చేలా కృషి
- వ్యాపారులు నిలదొక్కుకునేలా చర్యలు
- ముంపు ప్రాంతాల్లో లోన్లను రీషెడ్యూల్ చేయిస్తాం
- ప్రజలకు సిఎం చంద్రబాబు హామీ

**శనివారం ఉదయం కేంద్ర ప్రభుత్వానికి వరద సహాయం కోసం రిపోర్టు పంపిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. కంపెనీలు సీఎస్ఆర్ ద్వారా డైరెక్టుగా సాయం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వ్యాపారులు దెబ్బతిన్నారని... వారు నిలదొక్కుకునేలా ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.**



**అమరావతి సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** ప్రజలకు ఇన్సురెన్స్ సెటిల్ చేయాలంటే.. రియల్ టైంలో మానిటర్ చేస్తామని తెలిపారు. వరదల నుంచి విజయవాడకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడతామని సీఎం చంద్రబాబు అన్నారు.. ప్రకాశం బ్యారేజి 12 లక్షల క్యూసెక్కులు నీరు వచ్చిందని.. . దీంతో దీన్ని కూడా స్ట్రీమ్ లైన్ చేసేలా ఏం చేయాలనే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వాన్ని సాయం కోరామని అన్నారు. ముంపు ప్రాంతాల్లో లోన్లను రీషెడ్యూల్ చేయిస్తామని అన్నారు, డాక్యుమెంట్లు తిరిగి వారివి వారికి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. రిపోర్టు తాను పంపిస్తానని.. ఇంత వరకూ అయితే తాను పోవాల్సిన అవసరం లేదని తెలిపారు. వీరందరికి రీహ్యాబిలిటేషన్ చేయాలని అధికారులకు సూచించారు. రీ షెడ్యూల్ చేసి లాంగ్ టర్మ్ ఇన్‌స్టాల్‌మెంట్‌లు వచ్చేలా చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏపీలో ఆరు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏరియల్ సర్వే నిర్వహించి కొల్లేరు వరకూ వెళ్లి తర్వాత బుడమేరును అధ్యయనం చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కృష్ణనదికి వస్తున్న వరదపై క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు వివరించారు.

# కాంగ్రెస్‌లోకి ఫొగట్, పునియా


**ఖర్గేతో భేటీ తర్వాత వేణుగోపాల్ సమక్షంలో పార్టీలో చేరిన రెజ్లర్లు**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** రెజ్లర్లు వినేశ్ ఫొగట్, బజరంగ్ పునియా కాంగ్రెసలో చేరారు. వీరిద్దరూ కాంగ్రెసలో చేరతారంటూ కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల కిందట ఇద్దరూ వెళ్లి రాహుల్ గాంధీని కూడా కలిశారు. కొద్ది రోజుల్లో హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఫొగట్, పునియా శుక్రవారం కాంగ్రెసలో చేరడం గమనార్హం. తొలుత వీరిద్దరూ ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లి, ఆయనతో భేటీ అయ్యారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ హరియాణా ఇన్‌చార్జి దీపక్ బబారియా సమక్షంలో కాంగ్రె స్ కండువా కప్పుకొన్నారు. అనంతరం వి లేకరులతో వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఫొగట్, పునియాలు రాహుల్‌ను కలిసినందుకు రైల్వే అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారని చెప్పారు. రాజకీయ నేతలను కలవడం ద్వారా సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారని నోటీసులో పేర్కొన్నట్లు తెలిపారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతను కలవడం నేరమా? అని ప్రశ్నించారు. కాగా, శుక్రవారం ఫొగట్ రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్లు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఫొగట్ మాట్లాడుతూ.. రెజ్లింగ్ క్రీడాకారిణిగా తనకు అండగా నిలిచిన దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని.. వారి ఆకాంక్షలకు అనుగుణంగానే తాను ఆడినట్లు భావిస్తున్నానని చెప్పారు. తాము క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మద్దతుగా నిలిచిన కాంగ్రెసకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెసతో కలిసి పనిచేయడం గర్వంగా ఉందన్నారు. కాంగ్రెసలో చేరిన రెజ్లర్ వినేశ్ ఫొగట్ హరియాణాలోని జులానా నుంచి అసెంబ్లీకి పోటీ చేయనున్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ తొలి జాబితాలో ఆమె పేరు ఉంది. మరో రెజ్లర్ బజరంగ్ పూనియాను అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు.

# హైజంప్‌లో ప్రవీణ్‌కు పసిడి

**హైదరాబాద్: సెప్టెంబర్ 6,(జర్నలిస్ట్ వార్త):** ఫ్రాన్స్ రాజధాని పారిస్ వేదికగా జరుగుతున్న పారాలింపిక్స్‌లో భారత్ పతకాల వేట శుక్రవారం కూడా కొనసాగింది. పురుషుల హైజంప్‌లో భారత అథ్లెట్ ప్రవీణ్ కుమార్ పసిడి పతకం సాధించాడు. దీంతో పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ సాధించిన పతకాల సంఖ్య 26కు చేరింది. భారత్ ఇప్పటి వరకు ఆరు స్వర్ణాలు, 9 రజతాలు మరో 11 కాంస్య పతకాలను సాధించింది. కాగా, శుక్రవారం జరిగిన టి64 హైజంప్ విభాగం పోటీల్లో ప్రవీణ్ 2.08 ఎత్తు జంప్ చేసి పసిడి పతకాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో ఇదే అత్యుత్తమ హైజంప్ రికార్డు కావడం విశేషం. కాగా, పారాలింపిక్స్‌లో ప్రవీణ్‌కు ఇది వరుసగా రెండో పతకం. గతంలో టోక్యో ఒలింపిక్స్‌లో ప్రవీణ్ రజతం సాధించాడు. ఈసారి మరింత మెరుగైన ప్రదర్శనతో ఏకంగా పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇదే సమయంలో అతిచిన్న వయసులో పారాలింపిక్స్ స్వర్ణం సాధించిన




అథ్లెట్‌గా చరిత్ర సృష్టించాడు. ఇక పారాలింపిక్స్ హైజంప్ పోటీల్లో పసిడి పతకం సాధించిన రెండో భారత అథ్లెట్‌గాకూడా ప్రవీణ్ రికార్డు నెలకొల్పాడు. ఇంతకుముందు మరియప్పన్ తంగవేలు హైజంప్ విభాగంలో స్వర్ణం సాధించాడు. ఇదిలావుండగా పారిస్ పారాలింపిక్స్ హైజంప్ విభాగంలో భారత్‌కు ఇప్పటి వరకు మూడు పతకాలు లభించాయి. శరద్ కుమార్ రజతం సాధించగా, మరియప్పన్ కాంస్యం గెలుచుకున్నాడు. నోయిడాకు చెందిన ప్రవీణ్ కుమార్‌కు పుట్టుకతోనే కాలి వైకల్యం ఉంది. ఓ కాలు చిన్నగా ఉండటంతో చిన్నప్పుడూ ఎన్నో అవమానాలు భరించాల్సి వచ్చింది. చాలా ఏళ్ల వరకు ఆత్మన్యూనతా భావంతో బాధపడేవాడు. దాన్ని పోగొట్టుకునేందుకు క్రీడల వైపు మొగ్గాడు. ఆరంభంలో వాలీబాల్ ఎక్కువగా ఆడేవాడు. ఆ తర్వాత అథ్లెటిక్స్ కోచ్ సత్యపాల్ సింగ్ సూచన మేరకు హైజంప్ వైపు మళ్లాడు. సత్యపాల్ సింగ్ ప్రవీణ్ మేటి అథ్లెట్‌గా తీర్చిదిద్దారు. సత్యపాల్ శిక్షణలో రాటుదేలిన ప్రవీణ్ చిన్న వయసులో రెండు పారాలింపిక్స్ పతకాలు సాధించి సత్తా చాటాడు.

# వారసుడు వచ్చేశాడు..

## మోక్షజ్ఞ ఫస్ట్ లుక్ అదుర్స్..!




నందమూరి బాలకృష్ణ నట వారసుడు నందమూరి మోక్షజ్ఞ తెరంగేట్రం చేస్తున్న సినిమా ఫస్ట్ లుక్ వచ్చేసింది. కొన్నాళ్లుగా చర్చల్లో ఉన్న ఈ ప్రాజెక్ట్ పై ఈమధ్య దర్శకుడు ప్రశాంత్ వర్మ సింబా వస్తున్నాడంటూ హింట్ ఇవ్వగా నేడు మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా సినిమా ప్రకటించడంతో పాటుగా ఫస్ట్ లుక్ పోస్టర్ ని కూడా రిలీజ్ చేశారు. మోక్షజ్ఞ స్టైలిష్ లుక్ నందమూరి ఫ్యాన్స్ కి ఫెస్టివల్ వైబ్ తెచ్చింది. బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ తెరంగేట్రం కోసం ఎన్నో ఏళ్లుగా నందమూరి ఫ్యాన్స్ అంతా ఎదురుచూస్తున్నారు. ఫ్యాన్స్ తన మీద పెట్టుకున్న అంచనాలను ఏమాత్రం తగ్గకుండా తన మొదటి సినిమా ఉండాలని మోక్షజ్ఞ కొన్నాళ్లు నటనా శిక్షణ తీసుకున్నాడు. మొదటి సినిమాతోనే తన టాలెంట్ ఏంటన్నది చూపించడానికి రెడీ అయ్యాడు మోక్షజ్ఞ. అ! తో దర్శకుడిగా పరిచయమై ప్రతి సినిమాను నెక్స్ట్ లెవెల్ రిజల్ట్ అందుకుంటున్న ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో మోక్షజ్ఞ మొదటి సినిమా వస్తుంది.ఈ సినిమాను SLV సినిమాస్ బ్యానర్ లో సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. లెజెండ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై తేజశ్విని ఈ సినిమాకు సమర్పురాలిగా వ్యవహరిస్తున్నారు. సోషియో ఫాంటసీ కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి మోక్షజ్ఞ ఫస్ట్ లుక్ ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేసింది. మోక్షజ్ఞ తొలి సినిమా అనౌన్స్ మెంట్ చేస్తూ ప్రశాంత్ వర్మ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. మోక్షజ్ఞని పరిచయం చేయడం గొప్ప బాధ్యతగా భావిస్తున్నా.. నా మీద ఇంత నమ్మకం ఉంచినందుకు బాలకృష్ణ గారికి థాంక్స్. పురాణాలు ఇతిహాస కథతోనే ఈ సినిమా తెరకెక్కుతుంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లే సినిమా ఇది అవుతుందని అన్నారు ప్రశాంత్ వర్మ. మోక్షజ్ఞని లాంచ్ చేయడం చాలా సంతోషంగా ఉంది.. ఇలాంటి గొప్ప అవకాశం ఇచ్చినందుకు బాలకృష్ణ గారికి థాంక్స్. ఎస్.ఎల్.వి సినిమాస్ కి ఇది ఒక గోల్డెన్ ఆపర్చ్యునిటీ అని అన్నారు. ప్రశాంత్ వర్మ ఒక అద్భుతమైన కథతో వస్తున్నారు. మోక్షజ్ఞ తొలి సినిమాకు ఇది పర్ఫెక్ట్ గా సూట్ అవుతుంది. ఈ సినిమా కోసం మేమంతా చాలా ఆసక్తిగా ఉన్నామని మిగతా డీటైల్స్ త్వరలోనే వెల్లడిస్తామని అన్నారు నిర్మాత సుధాకర్ చెరుకూరి.


### టాలీవుడ్ లో విషాదం.. ప్రముఖ గేయ రచయిత

# వడ్డేపల్లి కృష్ణ కన్నుమూత

తొలుత పోస్ట్ మేన్ గా పని చేసిన కృష్ణ
తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వడ్డేపల్లి

టాలీవుడ్ లో విషాదం నెలకొంది. ప్రముఖ గీత రచయిత వడ్డేపల్లి కృష్ణ కన్నుమూశారు. ఆయన వయసు 76 సంవత్సరాలు. హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. రెండు రోజుల క్రితమే తెలుగు సినీ రచయితల సంఘం ఆయనను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించడం గమనార్హం. ఈ సంతోషకర సమయంలో ఆయన కన్నుమూశారు.

వడ్డేపల్లి కృష్ణ సిరిసిల్లలో చేనేత కుటుంబంలో జన్మించారు. తొలుత పోస్ట్ మేన్ గా ఉద్యోగం చేశారు. దర్శకుడిగా రెండు సినిమాలను తెరకెక్కించారు. ఆయన దర్శకత్వం వహించిన 'ఎక్కడకి వెళుతుందో మనసు' సినిమాలో సాయికుమార్ హీరోగా నటించారు. 'బలగం' సినిమాలో వడ్డేపల్లి నటించారు.




ఆయన రాసిన వందలాది లలితగీతాలు ఆకాశవాణి, దూరదర్శన్ లో ప్రసారమయ్యాయి. తెలంగాణ ఉద్యమంలో కూడా కృష్ణ చురుగ్గా పాల్గొన్నారు. ఆయన మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# థియేటర్స్ లో సందడి చేయనున్న "ఉరుకు పటేలా"

హుషారు వంటి చిత్రాలలో తన ఆకట్టుకునే నటనకు పేరుగాంచిన యువ మరియు ప్రతిభావంతుడైన నటుడు తేజస్ కంచెర్ల ఇప్పుడు ప్రేక్షకులను ప్రతిధ్వనించే కంటెంట్‌ను రూపొందించడంపై దృష్టి సారించాడు. నటుడు ఇటీవలే తన తదుపరి ప్రాజెక్ట్ ని ప్రకటించాడు. ఈ చిత్రానికి మూవీ మేకర్స్ "ఉరుకు పటేలా" అనే టైటిల్ ని లాక్ చేసారు. "గెట్ ఉరికిఫైడ్" అనే ట్యాగ్‌లైన్‌తో ఒక ప్రత్యేకమైన అనుభవాన్ని ఇస్తుంది. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి భారీ స్పందన లభించింది. ఈ చిత్రం సెప్టెంబర్ 7న అంటే రేపు విడుదలకి సిద్ధంగా ఉంది. ఈ విషయాన్ని తెలియజేసేందుకు చిత్ర బృందం సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసింది. ఈ చిత్రానికి వివేక్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ పతాకంపై కంచెర్ల బాల భాను నిర్మించిన ఈ సినిమాకి సన్నీ కుర్రపాటి సినిమాటోగ్రాఫర్ గా ఉన్నారు. ఈ చిత్రానికి ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తున్నారు.




# రాధా-కృష్ణ ఫోటోషూట్ లైంగికత దుమారం.. చిక్కుల్లో తమన్నా!



మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా తాజా ఫోటోషూట్ పై తీవ్ర దుమారం చెలరేగుతోంది. ఇటీవల శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రాధా-కృష్ణ థీమ్డ్ ఫోటోషూట్ ని తమన్నా ఇంటర్నెట్ లో షేర్ చేసింది. కానీ ఈ భామ దుస్తులు ధరించి, హద్దు మీరి శృంగారాన్ని ఒలకబోయడంతోరాధ-కృష్ణ భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. సాంప్రదాయం మాటున లైంగికతను ప్రేరేపించిందని తమన్నాపై చెలరేగారు. ఈ ఎదురుదెబ్బ తర్వాత తమన్నా రాధా ఫోటోషూట్‌ను సోషల్ మీడియాల నుంచి తొలగించింది. ఆ లోటు కనిపిస్తోంది ప్రముఖ ఫ్యాషన్ లేబుల్ ని ప్రమోట్ చేస్తూ రాధా-కృష్ణ ఫోటోషూట్‌లో భాగంగా వరుస ఫోటోలను షేర్ చేసిన తమన్నాపై సహజంగానే విమర్శలొచ్చాయి. రాధను లైంగికానికి గురిచేసావు అంటూ పలువురు నెటిజనులు ఆరోపించారు. శ్రీకృష్ణుడు-రాధల మధ్య ప్రేమ తాలూకా వివిధ దశలను చూపించిన లీలా: ది డివైన్ ఇల్యూషన్ ఆఫ్ లవ్%-% ఫోటోషూట్ నిజంగా శృంగార భరితంగా సాగింది. ఫ్యాషన్ డిజైనర్ కరణ్ తోరానీ డిజైన్ కి తమన్నా ప్రమోషన్ ఇది. కానీ ఇది లార్డ్ కృష్ణ- రాధ అభిమానులను తీవ్రంగా కలచివేసింది. ఫోటోషూట్ లో తమన్నాలోని ఒరిజినల్ రాధ బయటకు వచ్చిందని, ఇది తప్పుడు వ్యవహారం అని విమర్శిస్తూ ఇంటర్నెట్‌లోని ఒక సెక్షన్ తమన్నాను, డిజైనర్‌ను కూడా దూషిస్తూ కౌంటర్ వేసారు. మీ అమ్మకాల కోసం మా ప్రియమైన రాధా రాణి - శ్రీ కృష్ణుడి స్వచ్ఛమైన సంబంధాన్ని లైంగికంగా మార్చుకోవడం మానేయండి! మూరు?లారా! మీకు ఎంత ధైర్యం? అంటూ తమన్నా, తొరానియోలను ట్యాగ్ చేసారు. మరొక నెటిజన్ ఒక వీడియోను షేర్ చేసి రాధను తెరపై చిత్రీకరించడానికి రివీలింగ్ దుస్తులను ధరించినందుకు అతడు వ్యంగ్యంగా తిడుతూ కనిపించాడు. ఆన్‌లైన్‌లో తీవ్ర విమర్శలు పరిశీలించాక తమన్నా - టోరానీ లేబుల్ ఇద్దరూ తమ సోషల్ మీడియా హ్యాండిల్స్ నుండి ఫోటోలు, వీడియోలను తొలగించారు. ఈ పేజీలో కామెంట్లను కూడా పరిమితం చేసారు. ఈ వివాదంపై తమన్నా ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. నిజానికి తమన్నా ఈ కమర్షియల్ ఫోటోషూట్ వెనక చాలా పెద్ద ప్లాన్ ఉందని కూడా కొందరు విమర్శిస్తున్నారు. దాదాపు 170 దేశాల్లో విస్తరించి ఉన్న ఇస్కాన్- హరేకృష్ణ ఉద్యమంలోని భక్తులందరి దృష్టిని ఈ ఫోటోషూట్ ఆకర్షించింది. వారంతా తమన్నాపై తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.... తమన్నా ఇటీవల బ్లాక్‌బస్టర్ చిత్రం స్త్రీ 2 లో కనిపించింది. ఈ చిత్రంలో ఆజ్ కి రాత్ అనే పాటలో కనిపించింది. తమన్నా కదలికలు భంగిమలు దుమారం రేపాయి. జాన్ అబ్రహం నటించిన వేదాలో కూడా నటించింది. కానీ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విఫలమైంది

## అక్కినేని కుర్రోడు

# 15 ఏళ్ల కెరీర్ జర్నీ

ఏఎన్నార్, నాగార్జున లాంటి దిగ్గజ నటుల లెగసీని ముందుకు నడిపిస్తూ ఇటీవల నాగచైతన్య వడివడిగా అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. అక్కినేని వారసత్వంలో వరుస చిత్రాలతో బిజీగా ఉన్న స్టార్ నాగచైతన్య. అతడు సినీ పరిశ్రమలో తన 15వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం విశేషం. ఈ సందర్భంగా చైతూ అగ్రెస్సివ్ లుక్ తో ఉన్న డీపీని విడుదల చేయడం ఆసక్తికరం. చై ప్రయాణం 2009 చిత్రం జోష్‌తో ప్రారంభమైంది. కెరీర్ జర్నీలో తనవైన విలక్షణ ఎంపికలు, అద్భుత నటనతో చైతూ ప్రేక్షకులను ఆకర్షించాడు. సినీ కుటుంబం నుంచి వారసుడిగా వచ్చిన నాగ చైతన్య కుటుంబ లెగసీని నిలబెట్టడమే కాకుండా తన పరిధిని విస్తరించుకుంటున్న తీరు ఆసక్తికరం. చేసే పనిలో అంకితభావం- నిబద్ధత.. డౌన్-టు-ఎర్త్ వ్యక్తిత్వంతో అతడికి అభిమానులు అసాధారణంగా పెరిగారు. కెరీర్‌లో ఏ మాయ చేసావే -100 పర్సంట్ లవ్ -మజిలీ-లవ్ స్టోరీ-బంగార్రాజు-వెంకీ మామ వంటి అనేక విమర్శకుల ప్రశంసలు పొందిన, వాణిజ్యపరంగా విజయవంతమైన చిత్రాలను అందించాడు. అతడు అమీర్ ఖాన్‌తో లాల్ సింగ్ చడ్డాలో నటించి బాలీవుడ్ మార్కెట్‌లోకి ప్రవేశించాడు. ఇప్పుడు తండేల్‌తో పాన్-ఇండియన్ స్టార్ గా తనను తాను ఆవిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు. పరిశ్రమలో 15 ఏళ్ల మైలురాయిని సెలబ్రేట్ చేసుకోవడానికి తండేల్ టీమ్ కొత్త పోస్టర్ ని రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది. ఇందులో చైతూ ఒక మత్స్యకారుడిగా కనిపిస్తున్నాడు. తీరంలో వేచి ఉన్న బోట్‌లో దూకుడున్న కుర్రాడిలా నిలబడి స్మైల్ ఇస్తూ కనిపించాడు. చైతూ లుక్ వైజ్ మేకోవర్ కోసం ప్రయత్నించిన తీరు ఆకట్టుకుంటోంది. ఆంధ్ర ప్రదేశ్‌లోని ఒక తీర ప్రాంత గ్రామం నేపథ్యంలో సాగే ఈ చిత్రం నిజ జీవిత కథతో రూపొందుతోంది. చందూ మొండేటి దర్శకత్వంలో అల్లు అవింద్ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సాయి పల్లవి కథానాయికగా నటిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. తండేల్ నాగ చైతన్య కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్ చిత్రం. అతడికి చిరస్మరణీయమైన విజయాన్ని అందించడానికి మేకర్స్ ప్రతి విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నాగ చైతన్య ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేస్తున్నాడు. లుక్ పరంగా అవసరం మేర పరివర్తనను సాధించాడు. ఒక రియల్ మత్స్యకారుడిగా డిక్షన్ - బాడీ లాంగ్వేజ్‌ని సరిగ్గా పొందడానికి చాలా కష్టపడ్డాడు. నాగ చైతన్య కెరీర్ 15వ ఏట సరికొత్త మైలురాయిని సెలబ్రేట్ చేసుకుంటున్నప్పుడు తండేల్ తనకు మరో చిరస్మరణీయ విజయంగా మారుతుందని అక్కినేని అభిమానులు ఆశిస్తున్నారు. ఓటీటీ రంగంలో.. హర్రర్ థ్రిల్లర్ ధూతతో చైతన్య %బు% రంగంలోకి అడుగుపెట్టాడు. దేశవ్యాప్తంగా అతడి నటనకు ప్రశంసలు అందుకున్నాడు. నాగ చైతన్య తన ఆన్-స్క్రీన్ చరిష్మా తో అలరించడమే కాదు.. ఖరీదైన స్పోర్ట్స్ కార్ ల సేకరణతోను నిరంతరం అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. చైతన్య తన విలాసవంతమైన జీవనశైలిని ప్రతిబింబించే అత్యాధునిక కార్లతో తన గ్యారేజీని నింపాడు.

